

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 30 జనవరి 2024 | 5





మీరే మా దైవం : ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న చంద్రబాబు నాయుడు



మనదే విజయం : టీడీపీ జెండాతో మహిళ



ఇది నా టీమ్ : వేదికపై చంద్రబాబుతో గోరంట్ల, యనమల, చినరాజప్ప, రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, మద్దిపాటి, కందుల దుర్గేష్, జోన్-2 కో-ఆర్డినేటర్ మందలపు రవి, ప్రత్తిపాటి, బాపిరాజు, ఆర్ఎస్, యర్రా, హారీష్‌మాధుర్, బండారు తదితరులు

మీకు నేనున్నా : రాజమహేంద్రవరంలో జరిగిన రా కదలిరా సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు



జన గోదారి

తెలుగుదేశం పిలిచిందని.. కదిలొచ్చిన జనం

- జనచంద్రమైన రాజమహేంద్రి
- వేలాది వాహనాల క్యూ
- లక్షలాదిగా జన ప్రవాహం
- దారులుగా మారిన చేల గట్లు
- కిక్కిరిసిపోయిన కాతేరు
- గామన్ బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్
- టీడీపీ, జనసేన జెండాల హోరు
- జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన జనం

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/అర్బన్/రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం/కొవ్వూరు/తాళ్ళపూడి, జనవరి 29: గోదావరి తీరం.. జనగోదారిగా మారిపోయింది.. రాజమహేంద్రవరం నగరానికి జనం పోటెత్తారు. దారులన్నీ జనదారులుగా మారిపోయాయి. వాహనాలు కిలోమీటర్ల లెక్కన బారులు తీరాయి. ఎటుచూసినా, ఎక్కడ చూసిన జనమే. చేల గట్లు రహదారులయ్యాయి. రా కదలిరా సభా ప్రాంగణం అంతా జై టీడీపీ, జై జనసేన నినాదాలతో హోరెత్తింది. చంద్రబాబు 'రా.. కదలిరా' సభ జన 'చంద్ర'మైంది. మహిళాలోకం వెల్లువలా తరలివచ్చింది. వయసు పైబడిన పెద్దలు సైతం ఉత్సాహంగా కదలివచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో సోమవారం ఉదయం 10 గంటలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు "తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా" సభ నిర్వహించారు. సభ జరిగే ప్రదేశం చంద్రబాబు రాకకు రెండు గంటల ముందే జనంతో కిట కిటలాడింది. చంద్రబాబు సభను విశాలమైన మైదానంలో ఏర్పాటు చేసినా జన ప్రభంజనంతో నిండిపోయింది. సభా ప్రాంగణం కాతేరు ప్రధాన రహదారి పక్కనే ఉన్నా ఎటు చూసినా జనంతో నిండిపోవడంతో పొలం గట్లతో సహా అందుబాటులో ఉన్న అన్ని దారుల్లోనూ పసుపు దండు, జనసైనికులే కనిపించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలే కాకుండా, మిగిలిన జిల్లాల నుంచి కార్లు, బైక్‌లు, బస్సులు, ఆటోలు చివరకు సైకిళ్లపై కూడా టీడీపీ, జనసేన కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ప్రతి నియోజకవర్గం నుంచి 30 వేల మంది వస్తారని అంచనా వేయగా దాని తగినట్లుగానే తరలివచ్చారు. టీడీపీ, జనసేన జెండాలతో సభా ప్రాంగణం కళకళలాడింది.. జై చంద్రబాబు, జై పవన్ కల్యాణ్, జై తెలుగుదేశం, జై జనసేన అంటూ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. ఉదయం 10:30 గంటలకు సభ ప్రారంభం అయ్యే సమయానికి ఇటు కొవ్వూరు, కొంతమూరు, నాలుగోబ్రిడ్జి రోడ్డు, కాతేరు, సీతానగరం రోడ్డు, వాహనాలతోను, కార్యకర్తల ప్రదర్శనలతోను కిక్కిరిసింది.భారీ స్థాయి ఊరేగింపులు జరిగాయి.. రూరల్ మండలం ధవళేశ్వరం నుంచి, కడియం, రాజానగరం, సీతానగరం, రాజమహేంద్రవరం అర్బన్, కోరుకొండ మండలాలతో పాటు అటు కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, తాళ్లపూడి తదితర మండలాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు నాయకులు భారీ ప్రదర్శనలు నిర్వహిస్తూ కాతేరు చేరుకున్నారు. దీంతో ఆయా రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. సభ ముగిసిన తరువాత సుమారు గంట పాటు రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. ఆటుపై మధ్యాహ్నం 2-30, 3 గంటల మధ్య సాధారణ స్థితికి వచ్చింది. స్థానిక లూథర్‌గిరి కాంపౌండ్ నుంచి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెకటరీ ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ప్రసంగాన్ని జనం తదేకంగా విన్నారు. ప్రధానంగా మహిళలు చంద్రబాబును చూడడానికి ఉత్సాహం చూపించారు. నాయకులు ఊహించినదానికంటే జనం భారీగా తరలిరావడంతో కొన్ని చోట్ల ఫెక్సీలను సైతం పక్కకు పెట్టాల్సి వచ్చింది. ఎండ కాస్త ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా చంద్రబాబు స్పీచ్ వినడానికి ఆసక్తి చూపించారు. చంద్రబాబు సైతం జనాలను ఉత్సాహపరుస్తూ అధికార పార్టీని కడిగిపాడేశారు. మధ్యమధ్యలో జగన్‌పై ఆయన పేల్చిన హాస్యపు తూటాలకు జనం కేరింతలు కొట్టారు. పెద్ద సంఖ్యలో రెపరెపలాడిన టీడీపీ, జనసేన పార్టీల జెండాలు గెలుపు మనదే అన్నట్టుగా ఉండడంతో తెలుగు తమ్ముళ్ళు, జనసైనికుల్లో గోదారిలా ఉత్సాహం ఉప్పొంగింది. భారీగా తరలివచ్చిన జనం ఇబ్బందిపడకుండా వందలాది ప్యాకెట్ల మజ్జిగ, మంచినీళ్ల బాటిళ్లు, బస్తాలకొద్దీ వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలోనూ వివిధ ప్రాంతాల నుంచి జనం సభకు వస్తూనే ఉండడం గమనార్హం. ప్రవేశ ద్వారాలు ఎక్కువగా ఏర్పాటు చేయడం, ప్రాంగణం విశాలంగా ఉండడం, పార్కింగ్ ప్రణాళికాబద్ధంగా ఉండడంతో ఎవరికీ ఇబ్బంది కలగలేదు. చంద్రబాబు వెళ్లిన తర్వాత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు ట్రాఫిక్‌ని నాలుగో వంతెన మీదుగా మళ్లించడంతో పెద్దగా సమస్య రాలేదు. మొత్తం మీద రా కదలలిరా సభ విజయవంతమైంది.

వైసీపీ నాయకులే కౌరవులు..



జగన్ సభలో కౌరవులు, పాండవులుగా మాట్లాడారు. వాస్తవానికి జగన్ గ్రహించాల్సి ఒకటుంది. పాండవులనే వారు టీడీపీ జనసేన కూటమే. కౌరవులు వైసీపీ నాయకులు. జగన్‌కి రామ్‌గోపాల్ వర్మ నిర్మించిన వ్యూహం సినిమా గురించి తెలుసు.. కానీ పద్మవ్యూహం గురించి తెలుసుకోవాలి.మడుగులో దాగున్న దుర్యోధనుడు జగన్. వైసీపీ అనేది ఇంపోర్ట్ ఎక్స్‌పోర్టు కంపెనీగా తయారైంది. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను దోచేశారు. అన్ని వ్యవస్థలనూ సర్వనాశనం చేశారు. ఇసుక, మట్టి మాఫియా... ఇలా అన్ని వ్యవస్థల్లోను డబ్బులు నొల్లుకున్నారు. ఈ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు దాపురించాయి. టీడీపీ జనసేన కూటమి విజయబావుటా ఎగురవేయడం ఖాయం.

- కందుల దుర్గేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు

దళిత ద్రోహి జగన్...



నాలుగేళ్ల తొమ్మిది నెలల జగన్ పాలనలో ఈ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను అణచి వేసి జగన్ దళితద్రోహిగా మారాడు. ఇటీవల భీమిలిలో జరిగిన సభలో క్రాస్ ముద్రణపోలిన ర్యాంపు వేసి బూట్లు, చెప్పులు ధరించిన కాళ్లతో ఆ క్రాస్‌పై నడుస్తూ క్రైస్తవ్యాన్ని అపహాస్యం చేశాడు. భారత రాజ్యాంగానికి ఈ రాష్ట్రంలో తూట్లు పొడిచాడు. ఎస్సీఎస్టీ మైనారిటీలను దగా చేశాడు. మాస్క్ అడిగిన డా. సుధాకర్ మొదలు డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు మారణకాండను సృష్టించాడు. దళితజాతి ఆత్మగౌరవం నిలబడాలంటే టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే

జగన్‌ను ఇంటికి సాగనంపాలి



టీడీపీ హయాంలో 6,200 ఇళ్ళు కడితే వాటికి రంగులు మార్చాడే తప్ప వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా తూట్లు పొడిచాడు. జలజీవన్ మిషన్ రద్దు చేశాడు. రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేశాడు. బలహీన వర్గాలకు దగా చేశాడు. అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న జగన్‌ను ఇంటికి సాగనంపాలి.

- కేఎస్ జవహర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



జై బాబు : టీడీపీ జెండాతో మహిళ నినాదం



కిక్కిరిసిన కాతేరు రోడ్డు



వెల్‌కమ్ సార్ : వేదికపై చంద్రబాబుకు నమస్కరిస్తున్న నాయకులు



వచ్చేశాం : సభకు తరలివచ్చిన కొవ్వూరు టీడీపీ, జనసేన నాయకులు



మేం సైతం : నిడదవోలు నుంచి వెళుతున్న నాయకులు



బాబును కలుద్దామని : సభ వద్ద ముప్పాళ్ల, ఇతర న్యాయవాదులు



మీ కోసం వచ్చాం : సభా వేదిక వద్ద టీడీపీ జెండాలతో మహిళలు



బాబుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పత్తిపాటి, దుర్గేష్



నీవే మా రాజు : బాబుకు కిరీటం



మొక్కను ఇస్తున్న హరీష్, ఆదిరెడ్డి వాసు



బాబుతో జ్యోతుల నెహ్రూ



బాబుకు వరి కంకులు, నాగలి ఇస్తున్న చంటి



పుష్పగుచ్ఛమిస్తున్న బత్తుల

అర్ధరాత్రి హడావుడిగా....

- హైస్కూలు సెంటర్లో రాత్రికి రాత్రే వెలసిన 'దొమ్మేటి' విగ్రహం
- కౌన్సిల్ తీర్మానంతో ఏర్పాటు
- వైఎస్సార్ విగ్రహం వెనుక భాగాన ఆవిష్కరణ
- శెట్టిబలిజ సంఘీయుల్లో తీవ్ర చర్చ

అమలాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం హైస్కూలు సెంటర్లోని డివైడర్ మధ్యలో రాత్రికి రాత్రే ఓ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కరించిన ఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. శెట్టిబలిజ కమ్యూనిటీ పితామహుడైన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి నిలువెత్తు విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి దాటాక అక్కడే ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వెనుక భాగాన గల డివైడర్‌లో ఏర్పాటుచేసి ఆవిష్కరణ చేసిన తీరు శెట్టిబలిజ సామాజిక వర్గీయుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విగ్రహ వివాదం ఆ వర్గీయుల్లో రగడకు కారణమయ్యే పరిస్థితులు ఉత్పన్నం కానున్నాయి. మహనీయుని విగ్రహం ఏర్పాటుచేసి ఆవిష్కరించే తీరు ఇదేనా అని ఆ సంఘీయులు ఆందోళన చెందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి విగ్రహాన్ని ఆ సెంటర్లో నెలకొల్పాలని ఆయన వర్గీయులు భావిస్తున్న తరుణంలో దొమ్మేటి విగ్రహాన్ని పెట్టిన తీరు పరోక్షంగా కుడుపూడి వర్గీయులను వ్యతిరేకించినట్టయిందని ప్రచారం జరుగుతోంది. కాగా పట్టణంలో మూడు ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. హైస్కూలు సెంటర్లో దొమ్మేటి వెంకటరెడ్డి, 6వ వార్డులో మాజీ కౌన్సిలర్ పిండి సాయిబాబా, 23వ వార్డు నారాయణపేటలో కుడుపూడి కృష్ణమూర్తి విగ్రహాల ఏర్పాటుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీర్మానానికి ఆమోద ముద్ర వేసింది. అయితే జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్లలో విగ్రహాల ఏర్పాటుకు హైవే, ఆర్అండ్‌బీ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ కౌన్సిల్ తీర్మానం పేరుతో రాత్రికి రాత్రే దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కరించింది ఎవరనేది చర్చనీయాంశమైంది. నిబంధనలకు విరుద్ధంగా కౌన్సిల్ సైతం విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయడం ఇప్పుడు పట్టణంలో మరిన్ని విగ్రహ సమస్యలకు ఆజ్యం పోసినట్టయింది. అయితే చిట్టబ్బాయి విగ్రహం పెడతారని భావించిన వారికి గట్టి షాక్ తగిలింది. అయితే పోలీసులు సహా అధికారులంతా విగ్రహావిష్కరణ వివాదంపై లోపాయికారీగా విచారణ జరుపుతున్నారు.



హైస్కూలు సెంటర్లో పెట్టిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం

కదంతొక్కిన పెన్షనర్లు

కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా

అమలాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు పారుపూడి కృష్ణశాస్త్రి ధర్నా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు ధర్నా చేయాల్సి రావడం చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. అమలాపురం, రామచంద్రపురం, ఆలమూరు, మండపేట, రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట, రాజోలు యూనిట్ల నుంచి పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు మాట్లాడుతూ 11వ వేతన, డీఆర్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ప్రతినెలా ఒకటో తేదీన పెన్షను చెల్లించాలని డిమాండు చేశారు. అన్ని ఆసుపత్రుల్లో హెల్త్‌కార్డులు అనుమతించే విధంగా చూడాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. 2018 నుంచి చెల్లించాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, అదనపు క్వాంటమ్ పెన్షన్ పదో పీఆర్సీలో ఉన్న రేట్ల ప్రకారం సరి చేయాలన్నారు. అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాదరావు మాట్లాడుతూ సూపర్ సీనియర్ పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 70 ఏళ్ల రాగానే 15శాతానికి పెంచాలని డిమాండు చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలన్నారు. ధర్నా శిబిరాన్ని ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, కోదండ రామయ్య, డి.శ్రీనివాసరావు, కోశాధికారి డి.పృథ్వీరాజ్, చాముండేశ్వరి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.చంద్రకళ, ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధానకార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ధర్నా శిబిరంలో జిల్లా కోశాధికారి జేఎస్ శర్మ, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, ఎన్‌సీహెచ్ కృష్ణమూర్తి, వివిధ డివిజన్లకు చెందిన డీఎస్ సత్యనారాయణ, జీవీ సత్యనారాయణ, అల్లు వీర వెంకట సత్యనారాయణ, చిక్కం సూర్యనారాయణ, జీవీఎస్, సీహెచ్ రామమూర్తి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, మంగిపూడి రాంబాబు, మాండలీక ఆదినారాయణ, షాహీరా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట శిబిరంలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

టీడీపీ, జనసేనదే విజయం

● రా కదలిరా సభలో నేతలు ● ప్రభుత్వ విధానాలపై ధ్వజం



మాట్లాడుతున్న చంద్రబాబు..సభకు హాజరైన ఉమ్మడి జిల్లా నేతలు

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం: జనవరి 29 : కాతేరులో జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభలో టీడీపీ, జనసేన ముఖ్య నేతలు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిల అధ్యక్షతన సభ ప్రారంభమైంది. చంద్రబాబునాయుడు రాకకు ముందే ముఖ్య నాయకులు కొందరు సభలో మాట్లాడారు.

ఏ వర్గం సంతోషంగా లేదు

అనపర్తి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. గోదావరి చెంతనే ఉన్నా జిల్లా రైతాంగం పడుతున్న కష్టాలు వర్ణనాతీతమన్నారు. మొదటి పంటకు నీరివ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, ఇక రెండో పంట పరిస్థితి దారుణం అన్నారు. ధాన్యం కొనుగోలు మోసపూరితం అని, రైతుల సొమ్ములను వైసీపీ ప్రజాప్రతినిధులు కాజేశారని ఆరోపించారు. వైసీపీ అంటే రెడ్ల పార్టీ అని నమ్మించి మోసం చేశారని, ఈవేళ రెడ్లే జగన్ పేరు చెప్పుకోడానికి సిగ్గుపడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి 165 స్థానాల్లో విజయం సాధించడం ఖాయం అన్నారు.

ఏపీలో రాజకీయ సంక్షోభం

అనపర్తి జనసేన ఇన్‌చార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీ రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, రాక్షస పాలన సాగుతోందని, దీన్ని అంతమొందించేందుకు టీడీపీ, జనసేనలు కలిసి క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయాలన్నారు. 151 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తంచేస్తున్న జగన్ ఇటు 1 కానీ, అటు 1 కానీ పోయి 15, లేదా 51 సీట్లకు పరిమితమవుతాయన్నారు.

ప్రజల తిరుగుబాటుతో జగన్‌కు వణుకు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎప్పుడు దిగిపోతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రజల తిరుగుబాటుకు జగన్ భయపడుతున్నారన్నారు. టీడీపీ, జనసేన ఈ రాక్షస ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధిస్తోందన్నారు.

దుష్టపాలనను అంతమొందించాలి

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ దుష్టపాలనను అంతమొందించి రాష్ట్రాన్ని రక్షించేందుకు టీడీపీ, జనసేనలు ఏకమయ్యాయని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు చరిత్ర సృష్టించబోతున్నారని, విజయం తథ్యమని అన్నారు.

వైసీపీకి డిపాజిట్లు రావు

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. సహజ వనరులను, సంపదను వైసీపీ ప్రజాప్రతినిధులు భక్షించారన్నారు. ఇసుక, మట్టి పేరిట దోపిడీలు చేశారని.. ఆవ భూముల పేరుతో దోచేశారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి రాగానే వాటన్నింటినీ కక్కిస్తామన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో టీడీపీ యువత ఆవేశం కట్టలు తెంచుకుంటే అదుపు తప్పకుండా తమ నాయకుడు లోకేశ్ చాలా సమయస్ఫూర్తితో లీడ్ చేసి దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు. టీడీపీ జనసేనలు అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరుగుతుందని, బీసీ రక్షణ చట్టం వస్తుందని స్పష్టంచేశారు.

యువతకు ఉద్యోగాలు ఏవీ?

రాజమహేంద్రవరం జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ యువతకు జగన్ ఉద్యోగాలు ఇవ్వలేదుగానీ, మత్తును మాత్రం పెంచాడన్నారు. డ్రైవరు సుబ్రహ్మణ్యంను హత్యచేసిన ఎమ్మెల్సీని పక్కన కూర్చోబెట్టుకున్నారని, కోడికత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా చేశారని, బాబాయి హత్య కేసును విచారణ జరగకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు.

బీసీలకు గుర్తింపునిచ్చే పార్టీ టీడీపీ

టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ బీసీలకు గుర్తింపు ఇచ్చిందే అన్న ఎన్టీఆర్ అని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎదగడానికి దోహదపడ్డారన్నారు. ఆ రిజర్వేషన్లను చంద్రబాబు పెంచి అమలు చేశారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు అన్యాయం చేశారన్నారు. బీసీలకు విదేశీ విద్యనందించి ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఇస్తే, ఆదే బీసీ వర్గాలకు జగన్ మద్యం షాపుల్లో గుమస్తాలుగా, గ్రామాల్లో వలంటీర్లుగాను చేశాడన్నారు. టీడీపీ, జనసేన కూటమికి 170 సీట్లు రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

జగన్‌ది రాక్షస పాలన

గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం ముందు-తరువాత ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారిందని, అభివృద్ధి పథంలో ఉన్న ఆంధ్రరాష్ట్రంలో 42 ఏళ్ల తరువాత రాక్షస పాలన జగన్ రూపంలో వచ్చిందన్నారు. దీన్ని అంతమొందించేందుకు రా.. కదలిరాకు చంద్రబాబు పిలుపునిచ్చారని తెలిపారు. మోసపూరిత హామీలతో జగన్ మహిళల నెత్తిన చెయ్యి పెట్టారని, మద్యపాన నిషేధం అంటూ మహిళల తాళిబొట్లు తెంపేశాడన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టీడీపీ, జనసేనలు కలిశాయని స్పష్టంచేశారు.

అన్యాయంగా చంద్రబాబును అరెస్టు చేశారు

గోపాలపురం జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ అన్యాయంగా చంద్రబాబును 52 రోజులు జైలులో పెట్టి ఆధారాలు లేని కేసులో కక్షసాధింపులకు పాల్పడిన జగన్ ఆనాడే తన రాజకీయ పతనానికి నాంది పలికాడన్నారు. చంద్రబాబును పరామర్శించిన పవన్‌కల్యాణ్ ఆరోజు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఇరుపార్టీలు జగన్ పాలనపై పోరాడుతున్నాయన్నారు. నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో జగన్ రూ.9 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజల నెత్తిన భారాన్ని మోపాడని ధ్వజమెత్తారు.

ఈ సభలో టీడీపీ జనసేన నాయకులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాటి పుల్లారావు, చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మెన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ, రాజానగరం జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, శిష్టా లోహిత్, కాశి నవీన్‌కుమార్, అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చిల్లా జగదీశ్వరి, బండారు సత్యానందరావు, గంటా మురళి, పిల్లి అనంతలక్ష్మి, మాజీ మేయర్ పంతం రజనీశేషసాయి, కొవ్వూరు జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, జోన్ 2 కోఆర్డినేటర్ మందలపు రవి, చెల్లుబోయిన శ్రీను, నాయకులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, ప్రత్తిపాటి రామారావు చౌదరి, గట్టి నర్సయ్య చెరుకూరి రామారావు, సున్న కృష్ణ, పంతం గణపతి, గంగిన హనుమంతరావు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, గంగిన రంగయ్యచౌదరి, వాసిరెడ్డి రాంబాబు, వరగోగుల వెంకటేశ్వరరావు, పితాని శివ, మజ్జి పద్మ, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నన్నయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

- ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తికి గౌరవ డాక్టరేట్
- ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఉపకులపతి పద్మరాజు వెల్లడి



వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 29: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో జరిగే ఈ కార్యక్రమంలో వీసీతో పాటు గవర్నర్ అబ్దుల్‌నజీర్ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పద్మభూషణ్ సుధామూర్తి హాజరవుతారని, ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నామని చెప్పారు. నన్నయ యూనివర్సిటీలో 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందిస్తామన్నారు. ఈ 13, 14, 15వ స్నాతకోత్సవాలకు వివిధ కోర్సులుకు చెందిన 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్ మెడల్స్ 12, ప్రైజ్ 12 మిగిలిన వారు పీజీ కోర్సులు, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ వంటి కోర్సులు పూర్తిచేసిన వారు ఉన్నారని తెలిపారు. మూడు విద్యా సంవత్సరాల్లో విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో పీజీ పూర్తి చేసిన 8582, యూజీ పూర్తి చేసిన 50173 మంది విద్యార్థుల పట్టాలు ఆమోదిస్తారన్నారు. అతిథులుగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయ ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. స్నాతకోత్సవానికి సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

గైట్‌లో హెలిప్యాడ్ పరిశీలన



హెలిప్యాడ్ పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం, జనవరి 29: గైట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఆదికవి నన్నయ విద్యాలయంలో ఈ నెల 31న జరగనున్న స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక సందర్భంగా గైట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను వారు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాధవీలత అధికారులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు, డీఎస్పీ కిశోర్‌కుమార్, రాజానగరం సీఐ పి.కాశీ విశ్వనాథ్, తహశీల్దార్ పవన్‌కుమార్, నన్నయ వీసీ పద్మరాజు, రిజిస్ట్రార్ సుధాకర్, గైట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శర్మ, ఎన్‌సీసీ ఏఎన్‌వో ఏ.తేజేశ్వరరాజు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

- ఈ ఆర్థిక సంవత్సరం భారం ఉండదు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్
- 2024-25 ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు
- ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ఈ (2024-25) ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని డిస్కమ్ ప్రగతిని, ప్రతిపాదనలు వివరించారు. కేవలం రైల్వే ట్రాక్షన్ చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

కాల్వలో కొట్టుకుపోయిన చిన్నారి

కాట్రేనికోన, జనవరి 29: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుంచనపల్లి వద్ద బొబ్బర్లంక- పల్లంకుర్రు పంటకాల్వలో సోమవారం ఆరేళ్ల చిన్నారి కొట్టుకుపోయినట్టు స్థానికులు తెలిపారు. సంచార జాతులకు చెందిన కుటుంబం ఇక్కడ గుడారంలో నివాసముంటున్నారు. తల్లిదండ్రులు లేని సమయంలో చిన్నారి స్నానం కోసం కాల్వలోకి దిగి అదృశ్యమైనట్టు తెలుస్తోంది. ఎంత గాలించినా పాప ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లోని ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం పక్కన ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) సీఐ విజయ్‌శంకర్ తెలిపారు. ఆర్‌పీఎస్ఐ పెబ్బిలి లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9440627551 నెంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

రత్నగిరిపై పలు అభివృద్ధి పనులకు ఆమోదం

పాలకమండలి సమావేశంలో వివిధ అంశాలపై చర్చ



పాలకమండలి సమావేశం జరుగుతున్న దృశ్యం

అన్నవరం, జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం లభించింది. చైర్మన్ రోహిత్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈవో రామచంద్రమోహన్ ప్రతిపాదించిన అజెండాపై సభ్యులతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా కొండదిగువ టోల్‌గేట్ నుంచి సెంటినరీ కాటేజీ వరకు నిర్మించ తలపెట్టిన మెట్లమార్గం అంచనా వ్యయాన్ని రూ.85 లక్షల నుంచి రూ.90 లక్షలకు పెంచేందుకు ఆమోదం లభించింది. రూ.40 లక్షలతో టోల్‌గేట్ వద్ద నుంచి సత్యగిరి జంక్షన్ వరకు ఘాట్‌రోడ్డు పాడవడంతో బీటీ రోడ్డు వేసేందుకు ఆమోదించి దేవదాయ కమిషనర్ అనుమతితో చేపట్టాలని నిర్ణయించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న విద్యాసంస్థల్లో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది జీతభత్యాలకు రూ.90 లక్షలు సప్లిమెంటరీ బడ్జెట్‌కు అనుమతి కోరుతూ ప్రతిపాదించగా నిర్ణయాన్ని కార్యనిర్వహణాధికారికి వదిలివేశారు. సత్యగిరి కొండపై నిర్మించిన శివసదన్ కాటేజీ నందు సూట్‌రూంల అద్దెను 2000 నుంచి 2500కు పెంచాలని నిర్ణయించారు. ఇటీవల నూతనంగా నిర్మించిన ఆదిశంకర్ మార్గ్‌కు భద్రతా ప్రమాణాల దృష్ట్యా రూ.11.91 లక్షలతో క్రాస్ బేరియర్స్ ఏర్పాటుకు పిలిచిన లోయస్టు టెండర్ ఆమోదించారు. రూ.9 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీ వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపునకు బీటీ రోడ్డు వేసేందుకు ఆమోదం లభించింది. ఇటీవల దేవస్థానంలో వాహనాల కొనుగోలుకు సంబంధించి అవసరమైన ఇద్దరు డ్రైవర్‌లు, ఇద్దరు కండక్టర్‌లు, ఒక క్లీనర్‌ను ఔట్‌సోర్సింగ్‌పై తీసుకోవాలనే అంశాన్ని ఆమోదించి కమిషనర్ అనుమతి తీసుకోవాలని సూచించారు. రూ.26 లక్షలతో దత్తత ఆలయమైన శంఖవరం ఉమామహేశ్వర దేవస్థానంలో కల్యాణ మండపం అభివృద్ధి పనులు చేపట్టడంపై నియమ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. రూ.3.90 లక్షలతో మిచౌంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఘాట్‌రోడ్డు పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇటీవల పలు వ్యాపార సముదాయాల లైసెన్స్ హక్కులకు నిర్వహించిన వేలం పాటలలో హెచ్చుపాటలను ఆమోదించారు. సమావేశంలో సభ్యులు పేరూరి బద్రీనారాయణ, నక్కా అశ్విని, దోమాడ సుందరరావు, సహాయ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్లాపస్' సేవలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్(ప్లాపస్) సేవలు ప్రజలు వినియోగించుకునే విధంగా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ప్లాపస్‌పై ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, ప్రతినిధులతో ఆమె సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల చట్టం-1987 ద్వారా ఏర్పాటు చేసిన ప్లాపస్ విధులను వివరించారు. విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్యం, తపాలా, టెలిఫోన్, బీమా సంస్థలు, బ్యాంకింగ్ వంటి పది రకాల సేవలకు సంబంధించిన సమస్యలను జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్లాపస్ ద్వారా త్వరగా పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్లాపస్‌కు రూ.కోటి రూపాయల వరకూ వివాదాలు పరిష్కరించే పరిధి ఉందన్నారు. అర్జీదారులు కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, రాజీ మార్గంలో వివాద పరిష్కారానికి ప్రయత్నం చేస్తారన్నారు. ఒకవేళ రాజీ కుదరని పక్షంలో విచారణ జరిపి తీర్పు ఇచ్చే అధికారం ప్లాపస్‌కి ఉందని పీడీజే తెలిపారు. ప్లాపస్‌పై ప్రజలు కూడా అవగాహన పెంచుకొని సేవలు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ప్లాపస్ చైర్‌పర్సన్ ఏ.గాయత్రి దేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి, డీఈవో ఎస్.అబ్రహం, కోనసీమ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్, బీఎస్ఎన్ఎల్ జేఏవో వై.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఆధార్ లింక్‌తో 27 విద్యుత్ కనెక్షన్లు

ఆలమూరు, జనవరి 29: ఆయనో వ్యవసాయ కూలీ... కానీ ఆయన ఆధార్ నెంబరుతో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 27 విద్యుత్ కనెక్షన్లు లింకై ఉన్నాయి. దీంతో ప్రభుత్వ పథకాలు రావడం లేదు. లబోదిబోమని విద్యుత్ కార్యాలయానికి వెళితే 27 కనెక్షన్లు ఉన్నాయని అధికారులు చెప్పడంతో వాపోయాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లకు చెందిన గంటా సింహాచలం దాదాపు 2,700 యూనిట్లు విద్యుత్ వాడుకున్నట్టు అధికారులు స్పష్టం చేశారు. దీంతో రాయితీ పథకాలు వర్తించవని చెప్పారు. ఇదేమిటని ఆయన విద్యుత్ శాఖ కార్యాలయానికి పరుగులు తీస్తే రామచంద్రపురం డీఈ ఆఫీసుకు వెళ్లమని చెప్పారు. సింహాచలం అక్కడికి వెళ్తే ఆధార్ నెంబరుతో 27 కనెక్షన్లు లింక్ చేసి ఉన్నాయని చెప్పడంతో అతడు కంగుతిన్నాడు. తనకు ఇన్ని మీటర్లు ఉండటమేమిటని ప్రశ్నించాడు. ఇలా ఎలా జరిగిందో తమకు తెలియదని, గ్రామ సచివాలయంలో ఒక్కో కనెక్షన్‌కు రూ.35 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే రద్దు చేస్తామని అధికారులు సెలవిచ్చారు. వారు తప్పు చేసి తనను డబ్బులు చెల్లించి కనెక్షన్లు రద్దు చేసుకోమనడం ఎంతవరకు న్యాయమని సింహాచలం వాపోయాడు.

మహిళపై హత్యాయత్నం: రెండేళ్ల జైలు

సర్పవరం జంక్షన్, జనవరి 29: తనతో సహజీవనం చేస్తున్న వివాహితపై అనుమానంతో హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీఎస్ పద్మజ తీర్పునిచ్చారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి శివారు తాటూరు గ్రామానికి చెందిన 36 ఏళ్ల కాకాడ వెంకటరమణ అనే వ్యక్తి రమణయ్యపేట ఆర్టీసీకాలనీలో నివాసం ఉంటున్న వివాహితతో ఏడాది పాటు సహజీవనం చేశాడు. అనుమానం పెంచుకున్న వెంకటరమణ 26-10-2022వ తేదీన పిల్లల్ని మోటార్ బైక్‌పై స్థానిక రమణయ్యపేట మున్సిపల్ హైస్కూల్లో దింపి ఇంటికి తిరిగి వస్తున్న తరుణంలో మార్గమధ్యంలో ఇనుపరాడ్డుతో వివాహితను తలపై బలంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ కేసులో బాధితురాలి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీఎస్ పద్మజ తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ డానియల్ దినకర్ జాన్సన్ వాదించారు. కోర్టు కానిస్టేబుల్ బి.శ్యామలరావు ఎస్‌హెచ్‌వోను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

వేదికపై తూలిన చంద్రబాబు

వెనుక చెయ్యి పట్టి ఆపిన భద్రతా సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, జనవరి 29: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో రా.. కదలిరా సభకు విచ్చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు సభ ముగించుకుని వెళుతున్న క్రమంలో నేతల రద్దీతో సభా వేదిక కిక్కిరిసింది. ఈ క్రమంలో ఒకరిద్దరు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చే క్రమంలో కొంత మీదకు రావడంతో ఆయన తూలారు. అప్రమత్తమైన ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది వెనుక నుంచి చెయ్యి అడ్డం పెట్టి బ్యాలెన్స్ తప్పకుండా నిలువరించారు. వెంటనే సిబ్బంది చెయ్యి అడ్డుపెట్టి చంద్రబాబును కాన్వాయ్ వద్దకు తీసుకెళ్లారు.

సాహిత్యం ఉన్నంతకాలం వేటూరి ఉంటారు

● వేటూరి సాహితీ పీఠం పురస్కార గ్రహీత జేకే భారవి



జేకే భారవిని సత్కరించిన ప్రముఖులు

తుని రూరల్, జనవరి 29: 'కలలు చెదిరినా పాటే, కలత చెందినా పాటే'.. ఎలాంటి భావాన్నైనా పలికించగలిగే శక్తి వేటూరికే సాధ్యమని, క్లిష్టమైన, సరళమైన పదాలతో గారడీ చేస్తూ ఆడుకోవడం వేటూరి మాత్రమే చేయగలరని ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జేకే.భారవి అన్నారు. సంగీతం, సాహిత్యం ఉన్నంతవరకు వేటూరిని మరిచిపోలేమని అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా తునిలోని చిట్టూరి మెట్రోలో వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేటూరి జయంతి వేడుకల్లో ఈ ఏడాది త్రయోదశ(13వ) వేటూరి కవితా పురస్కారాన్ని జేకే భారవి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటూరి వారి పురస్కారానికి తనను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నేటి యువతకు గాయకులుగా, గేయ రచయితలుగా చాలా అవకాశాలున్నాయని చెప్పారు. కవులకు ధనం ముఖ్యం కాదని, వారి వారి వాక్చాతుర్యం, రచనా శైలి నిజమైన సంపద అని అన్నారు. అన్నమయ్య, రామదాసు, మంజునాథ సినిమాలకంటే ఆదిశంకరాచార్య సినిమాకు యూట్యూబ్ వీక్షకులు ఎక్కువ ఉండడం తనకు వచ్చిన విజయంగా భావిస్తున్నానని అన్నారు. తెలుగు పాటకు వన్నె తెచ్చిన వ్యక్తిగా వేటూరి చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్, రసమాధురి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల సీతారామ ప్రభు మాట్లాడుతూ వేటూరి మన మధ్య లేకపోయినా పాటల రూపంలో బతికే ఉన్నారని, కవులు ఉన్నంతకాలం తెలుగు భాష వైభవం తగ్గదని అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత జేకే భారవిని తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు పుస్తకాలతో ఘనంగా సత్కరించారు. వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితి పీఠం ప్రధాన కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మతో పాటు తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

మళ్లీ పెద్దపులి జాడలు



గాలింపు చర్యల పర్యవేక్షణ

- విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు

నల్లజర్ల, జనవరి 29: పెద్ద పులి వచ్చిన జాడలు మళ్లీ కనిపించినట్టు డీఆర్‌వో వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ రాత్రి నల్లజర్ల మండలం పుల్లలపాడు, నల్లజర్ల పరిసర ప్రాంతాల్లో పెద పులి సంచరిస్తునట్టు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం నిజమైంది. శుక్రవారం ద్వారకాతిరుమల మండలం వైపు వెళ్లిన పెద్ద పులి తిరిగి అయ్యవరం మీదుగా పుల్లలపాడు వైపు వచ్చినట్టు డీఆర్‌వో చెప్పారు. పులి పాదముద్రలు సేకరిస్తున్నామని, ప్లెగ్ మార్క్ సేకరించి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పులిని పట్టుకునేందుకు ప్రభుత్వం ఒక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇదిలా ఉండగా ఏలూరు డీఎఫ్‌వో రవీంద్రదామ తన బృందంలో పులి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం అయ్యవరం-దూబచర్ల గ్రామాల మధ్య ఉన్న ఆయిల్‌పామ్ తోటల్లో పులి పాదముద్రలు ఉన్నట్టు గుర్తించారు. అక్కడ ట్రాప్ కెమెరా అమర్చారు. ఆయన వెంట డీఆర్‌వో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి రత్నం ఉన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం పెరుగూడెంలో పెద్ద పులి ఉన్నట్టు సమాచారం రావడంతో వెంటనే బయలుదేరి వెళ్లారు. తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో రెండు పెద్ద పులులు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

క్షుద్ర పూజల కలకలం



పెద్దాపురం, జనవరి 29: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. తమ ఇళ్ల ముందు ముగ్గులు, ఎండు మిరపకాయలు, కుంకుమ, పసుపు మొదలయిన వాటిని పెట్టి క్షుద్ర పూజలు చేస్తున్నారని పలువురు ఆరోపించారు. అర్ధరాత్రి సమయంలో ఎవరో ఈ పనులు చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెలుగుల సురేష్ గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. మూఢ నమ్మకాలను నమ్మవద్దని ప్రజలకు తెలియచేశారు. గ్రామంలో పోలీసు పహారా ఏర్పాటు చేస్తామన్నారు.

ఇద్దరి యువకులకు గాయాలు

ముమ్మిడివరం, జనవరి 29: ఉప్పలగుప్తం మండలం మునిపల్లికి చెందిన దోనిపాటి సతీష్, ముమ్మిడివరానికి చెందిన కుంచే రాజేష్‌లు స్కూటీపై వస్తుండగా అనాతవరం-భీమనపల్లి రోడ్డులో సోమవారం ప్రమాదం జరిగింది. రాజేష్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గాయపడిన ఇద్దర్ని అంబులెన్సులో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వాహనం ఢీకొట్టిందా లేదా వారే అదుపుతప్పి పడిపోయారా తెలియాల్సింది ఉంది. ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

'స్పందన'కు 214 అర్జీలు

అమలాపురం టౌన్, జనవరి 29: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి 'స్పందన'కు 214 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నుపూర్‌అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు అర్జీలను స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ కార్పొరేషన్ ద్వారా సమకూర్చిన ల్యాప్‌టాప్‌లను డిగ్రీ, ఆపై ఉన్నత చదువులు చదువుకున్న నలుగురు దివ్యాంగులకు కలెక్టర్ ఒక్కొక్కటి రూ.35వేలు విలువైన ల్యాప్‌టాప్‌లను అందజేశారు. వయో వృద్ధులశాఖ ప్రతినిధులు పి.నారాయణమూర్తి, శ్రీరామ్ పాల్గొన్నారు.

జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణా విభాగం ఆధ్వర్యంలో ఈనెల30నుంచి ఫిబ్రవరి 13వరకు స్పర్శ కుష్టు వ్యాధి నిర్మూలనకై పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడిగా దొరబాబు



అమలాపురం టౌన్, జనవరి 29: ఎస్టీయూ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ ప్రకటించారు. అధ్యక్షుడిగా పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శిగా సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శిగా నేరేడుమిల్లి సత్యనారాయణలతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, మాజీ ఎమ్మెల్సీలు కేవీవీసత్యనారాయణరాజు (చైతన్యరాజు), కె.రవికిరణ్‌వర్మ, మాజీ ఆర్థిక కార్యదర్శి కేకేవీ నాయుడు, సీనియర్ నాయకులు ఎన్వీ నాయుడు, కల్యాణం వీవీ సత్యనారాయణ, ఏసురాజు తదితరులు అభినందించారు.

జనసేన కార్యకర్త మృతి

ఐ.పోలవరం, జనవరి 29: మురమళ్ళకు చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త మీసాల శ్రీనివాసరావు సోమవారం మృతి చెందారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ శ్రీనివాసరావు పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మద్దింశెట్టి పురుషోత్తం, వాసంశెట్టి బాబ్జి, గంజా ఏసు పాల్గొన్నారు.

బోట్స్‌మెన్ ర్యాంపులో డ్రెజ్జర్‌కు అనుమతులు లేవు

-ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పి.గన్నవరం, జనవరి 29: లంకలగన్నవరం బోట్స్‌మెన్ ఇసుక ర్యాంపులో డ్రెజ్జర్ ద్వారా తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని ఇన్‌చార్జ్ తహశీల్దార్ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన తవ్వకాలకు హద్దులేవీ! కథనానికి స్పందించారు. ఇసుకర్యాంపులో ఇన్‌చార్జ్ ఆర్ఐ పి.నరసింహారావు, వీఆర్వో కోరుకొండ శ్రీను, సిబ్బంది పరిశీలించారు. డ్రెజ్జర్‌ను అక్కడ నుంచి బయటకు పంపించామని, గనులశాఖ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మట్టి ర్యాంపులపై కూడా నిఘా ఉంచామని నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే ర్యాంపులను నిలిపివేస్తామన్నారు.

కొనసాగుతున్న రైల్వేలైన్ సర్వే పనులు

అమలాపురం రూరల్, జనవరి 29: గతంలో చేసిన ఎలైన్‌మెంట్‌ను మార్పు చేసి కోనసీమ రైల్వేలైన్ కోసం కొత్తగా భూముల సర్వే చేపట్టడాన్ని పలు గ్రామాల ప్రజలు నిరసిస్తున్నారు. సోమవారం భట్నవిల్లి సమీపంలో రైల్వేలైన్ సర్వే పనులు జరుగుతున్నాయన్న సమాచారంతో ఆ ప్రాంతానికి ఇళ్ళు, భూములు కోల్పోయేవారు చేరుకుని అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న తాలూకా ఎస్ఐ వైశేఖర్‌బాబు సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని ఎస్ఐ సూచించడంతో వారంతా వెనుదిరిగారు.

జనసేనలో చేరిక

ఆత్రేయపురం, జనవరి 29: ర్యాలి కొమ్మరపేటకు చెందిన మాదిగ సామాజిక వర్గీయులు టీడీపీలో చేరారు. వారికి కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చేకూరి కృష్ణంరాజు, సలాది రామకృష్ణ, జనసైనికులు పాల్గొన్నారు.

కామెర్ల వైద్యునికి తోట పరామర్శ

ద్రాక్షారామ, జనవరి 29: ప్రముఖ కామెర్ల వైద్యులు గుండుబోగుల స్వామినాయుడు సతీమణి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సూర్యనారాయణమ్మ ఇటీవల మరణించారు. స్వామినాయుడుని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు.

మెటీరియల్ బిల్లును తీర్మానం నుంచి తొలగించాలి

- అర్ధంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం
- పోడియం ఎదుట టీడీపీ కౌన్సిలర్ల బైఠాయింపు
- ఫ్లోర్‌లీడర్, చైర్మన్ మధ్య వాగ్వివాదం



పోడియం ఎదుట బైఠాయించిన టీడీపీ కౌన్సిలర్లు

ముమ్మిడివరం, జనవరి 29: నాసిరకం గ్రావెల్‌ను రోడ్ల ప్యాచ్ వర్కులకు వినియోగిస్తున్నారంటూ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌కు, ఫ్లోర్ లీడర్ బాలకృష్ణకు తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకోవడంతో కౌన్సిల్ సమావేశం అర్ధంతరంగా ముగిసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో 11వ అంశంగా 20వార్డుల్లో రోడ్లకు ప్యాచ్ వర్కు చేపట్టేందుకు నగర పంచాయతీ సాధారణ నిధులు రూ.15లక్షలు కేటాయించడం.. ఆ నిధులతో గేదెల్లంక ఆయిల్ ఇండియా డ్రిల్లింగ్ సైటు నుంచి గ్రావెల్ తీసుకువచ్చి రోడ్లు ప్యాచ్ వర్కులు చేయడానికి ప్రవేశపెట్టిన బిల్లు తీర్మానంపై ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ గ్రావెల్ మట్టి, బూడిదతో ఉందని, పూర్తిగా నాసిరకంగా ఉన్న ఆ గ్రావెల్‌తో రోడ్డు ప్యాచ్ వర్కు చేయడం ఎంత వరకు సమర్థనీయమని కమిషనర్ జి.లోవరాజు, ఏఈ కె.సత్యనారాయణను బాలకృష్ణ నిలదీశారు. బయట మార్కెట్‌లో నంబరు1 గ్రావెల్ లారీ రూ.11వేలు, రూ.12వేలకు వస్తుందని, అటువంటిది ఈనాసిరకంగా గ్రావెల్ లారీకి రూ.8వేలు ఖర్చుచేయడం ఎందుకని, ప్రజా ధనం దోచుకుంటున్నారంటూ బాలకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్‌లు ఆరోపిస్తూ ఆ పనుల బిల్లును తీర్మానం నుంచి తొలగించాలని డిమాండు చేశారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కలగజేసుకుని ప్రజా అవసరాల దృష్ట్యా తానే ఆ పనులు చేయమని ఆదేశించానని, ఆయిల్‌ఇండియా కంపెనీవారు ఉచితంగా ఆ గ్రావెల్‌ను ఇచ్చిందని, దీంట్లో ప్రజాధనం దుర్వినియోగం అంటూ ఏమీ అవ్వలేదన్నారు. దీనిపై కమిషనర్, ఏఈ సంజాయిషీ ఇవ్వాలని ఫ్లోర్ లీడర్ డిమాండు చేయడంతో వారివురి మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. గతంలో మీ ప్రభుత్వ హయాంలో కూడా టెండర్లు పిలవకుండా అత్యవసర పనులు చేయలేదా?, ఈపనుల్లో ఎక్కడా ప్రజాధనం దోచుకోవడం గానీ, దుర్వినియోగం గానీ జరగలేదని, చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్లిసిటీ కోసం రాద్ధాంతం చేస్తున్నారంటూ చైర్మన్ పేర్కొన్నారు. దీంతో ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ కౌన్సిలర్లంతా పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రూ.15లక్షల ప్యాచ్ వర్కు పనులపై కమిషనర్, ఏఈలు ముందుగా ఎందుకు తెలియచేయలేదు, టెండర్లు పిలవకుండా పనులు ఎందుకు చేపట్టవలసి వచ్చిందనే విషయంపై స్పష్టత ఇవ్వాలని లేకపోతే తాను కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని బాలకృష్ణ హెచ్చరించారు. వైసీపీ కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ కలగజేసుకుని ప్రజా అవసరాల దృష్ట్యా కౌన్సిలర్ల కోరిక మేరకు ఆ పనులు చేపట్టారని, నిధులు దుర్వినియోగం కాలేదని సర్దిచెప్పే ప్రయత్నం చేయగా వారు శాంతించలేదు. దీనిపై కమిషనర్ జి.లోవరాజు మాట్లాడుతూ ఆ పనులకు రూ.15లక్షలు కేటాయించినా పని జరిగిన మొత్తానికి మాత్రమే బిల్లుల చెల్లింపు ఉంటుందని, నిధుల దుర్వినియోగం ఏమీ ఉండదని చెప్పినా టీడీపీ కౌన్సిలర్లు సంతృప్తి చెందకపోవడంతో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణతో సర్దిచెప్పే ప్రయత్నంలో వారు ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. చైర్మన్ చెప్పే వివరణకు టీడీపీ కౌన్సిలర్లు సంతృప్తి చెందకపోవడంతో చైర్మన్ ప్రవీణ్‌కుమార్ సహనం కోల్పోయి సంప్రదాయాన్ని పాటించనందున సమావేశాన్ని ఇంతటితో ముగుస్తున్నానని ప్రకటించి సమావేశం నుంచి ఆయన చాంబర్‌కు వెళ్లిపోయారు. ఆ తరువాత వైసీపీ కౌన్సిలర్లు, అధికారులు బయటికి వెళ్లిపోయారు. దీనిపై ఫ్లోర్‌లీడర్ బాలకృష్ణ, టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే చైర్మన్ వెళ్లిపోయారని, రూ.15లక్షల బిల్లును అధికారులు, చైర్మన్ దోచుకునే స్థితికి దిగజారారని ఆరోపించారు. మెజార్టీ సభ్యులు ఉన్నందున బిల్లులు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఇది దారుణమన్నారు. ఈ బిల్లును తీర్మానం నుంచి తొలగించాలని వారు డిమాండు చేశారు. కౌన్సిల్ సమావేశంలో 17అంశాలతో ఒక అజెండాను, 8అంశాలతో మరో అజెండాను ప్రవేశపెట్టినా వాటిపై ఏవిధమైనా చర్చ జరగలేదు. 17వ అంశంలో బిల్లు తీర్మానంపై టీడీపీ కౌన్సిలర్లు అభ్యంతరం చెప్పడంతో వాగ్వివాదం చోటు చేసుకుని సమావేశం అర్ధంతరంగా ముగిసిది.

జలజీవన్ మిషన్ పనులకు భూమిపూజ

అయినవిల్లి, జనవరి 29: మండలంలో పదిహేడు గ్రామ పంచాయతీల్లో జాతీయ జలజీవన్ మిషన్ పనులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేను గోపాల్ సోమవారం అయినవిల్లిలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

మలికిపురం, జనవరి 29: ఉపాధి వేతన బకాయిలను కూలీల ఖాతాలో జమచేయాలని ఉపాధి కూలీ సంఘం ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. వేతన బకాయిల కోసం కేంద్రం నుంచి రూ.663 కోట్లు రాష్ట్రానికి విడుదలై పది రోజులైనా ఇప్పటివరకు కూలీల ఖాతాల్లో జమ చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఉపాధి కూలీ సంఘ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేక బాధపడుతున్నారని, వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు.

సీనియర్ కమ్యూనిస్టు నాయకురాలు మృతి

మలికిపురం, జనవరి 29: ఉయ్యూరివారిమెరకకు చెందిన బత్తుల జాజిసరోజిని(85) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఈమె కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు బత్తుల రామమూర్తి సతీమణి. భర్తతో పాటు పార్టీలో సరోజిని క్రియాశీలకంగా పనిచేశారు. వీరికి ముగ్గురు సంతానం. ఈమె పార్థివదేహాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, సీపీఐ నాయకులు దేవరాజేంద్ర ప్రసాద్, బీఎస్పీ సీనియర్ నాయకుడు బత్తుల లక్ష్మణరావు, పౌరహక్కుల సంఘ నాయకుడు జిల్లెల్ల మనోహర్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

జనసేన పార్టీకి రాజీనామా చేసిన రౌతు

రావులపాలెం, జనవరి 29: జనసేన పార్టీకి రాజీనామా చేసినట్టు రౌతు ఈశ్వరరావు (కాశి) తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈనిర్ణయం తీసుకున్నానని ఆయన చెప్పారు.

రెగ్యులర్ చేస్తామన్న హామీని అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట సెర్ప్ ఉద్యోగుల వంటా-వార్పు



కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

అమలాపురం టౌన్, జనవరి 29: అధికారంలోకి వచ్చిన వెంటనే సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండు చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో భాగంగా వంటా-వార్పు నిర్వహించారు. బుధవారం జరిగే కేబినెట్ సమావేశంలో సెర్ప్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సెర్ప్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు డిమాండు చేశారు. సమ్మె శిబిరాన్ని కాట్రేనికోన మండల వీవోఏలతో పాటు పలు మండలాల ఎంఎస్ అక్కౌంటెంట్లు సందర్శించి సంఘీభావం తెలిపారు. సమస్యల పరిష్కారానికై కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. సెర్ప్ ఉద్యోగులు కేవీబీ ప్రసాద్, షేక్ సయ్యద్, ఎం.శామ్యూల్, ఎంపీఎల్ కుమారి, పీవీ రమణ, భూపతివర్మ, కె.వెంకటలక్ష్మి, ఎం.నాగవేణి, అయితాబత్తుల సురేంద్ర, ర్యాలి అర్జున్, ముత్యాల రమేష్, పి.రమాకాంత్, నక్కా నాగవేణి, ఎం.ధనరాజు, మోర్త సత్యవతి, వివిధ సంఘాల నాయకులు కె.దుర్గ, జోగారావు, పుష్పలత పాల్గొన్నారు.

రామచంద్రపురం పట్టణాభివృద్ధికి కృషి: బోస్

మున్సిపల్ సాధారణ,అత్యవసర సమావేశం

రామచంద్రపురం, జనవరి 29: అన్ని మౌలిక సదుపాయాలతో రామచంద్రపురాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ బోస్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతను సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంపీ బోస్ హాజరయ్యారు. సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు, నిధుల మంజూరు కోసం ప్రవేశపెట్టిన 19 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో అజెండాలోని 2అంశాలకు చెందిన అభివృద్ధి పనుల టెండర్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. కౌన్సిలర్ కట్టా శ్రీరాములు, చీఫ్‌విప్ వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారుల్లో కొంతమందిని తొలగించి, వారికి ఏవిధమైన లబ్ధిచూపకుండావారి డిపాజిట్ సొమ్మును తిరిగి చెల్లించలేదు, వార్డుల్లో పర్యటించాలంటే సిగ్గుగా వుందని, వారిని ఓట్లు ఏవిధంగా అడగాలో తెలియడం లేదన్నారు. దీనికి కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి సమాధాన మిస్తూ 900మంది అనర్హులను గుర్తించామని, ప్రభుత్వం మున్సిపల్ ఎకౌంట్‌లో ఆ సొమ్మును జమచేస్తే లబ్ధి దారులకు మున్సిపాలిటీ చెల్లిస్తుందన్నారు. వైస్‌చైర్మన్ కోలమూరి శివాజీ, వాడ్రేవు సాయిప్రసాద్ పలు సమ స్యలపై ప్రశ్నించగా కమిషనర్ సమాధానమిచ్చారు. వైస్ చైర్మన్-2 చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పోతంశెట్టి వెంకట శ్యామల, శ్వేతపావనీ, కేతా శ్రీను, కోటిపల్లి లక్ష్మి, కుడుపూడి లలిత, కేతా సుజాత, తోట అమ్మాజీ పాల్గొన్నారు.

మల్లాడిని కలిసిన రాజేంద్రప్రసాద్

యానాం, జనవరి 29: త్వరలో జనసేన పార్టీలో చేరుతున్న తరుణంలో రాజకీయ గురువు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును మర్యాదపూర్వకంగా సేవరత్న డాక్టర్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కలిశారు. పలు అంశాలపై చర్చించారు. రాజకీయం, సేవారంగాల్లో మల్లాడి కృష్ణారావే ఆదర్శమన్నారు. ఆయన వెంట తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి బడే కృష్ణా, సురేష్, వార్డుల డివిడజన్ ఇన్‌చార్జిలు పెద్దిరెడ్డి రాజేష్, నాగాబబు, ప్రసాద్, వీరబాబు, దుర్గ ప్రసాద్, తాతాజీ, బాబీ ఉన్నారు.

పథకాలు అమలులో సమాచారం ఇవ్వకపోతే ఎలా!



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

కె.గంగవరం, జనవరి 29: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో తమకు ఏమాత్రం సమాచారం ఇవ్వడంలేదని అధికార పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అసహనం వ్యక్తంచేశారు. సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. దీనికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ నాగమణి శాఖల వారీ సమీక్ష చేశారు. ఆరోగ్యశాఖ సమీక్ష జరుగుతున్నప్పుడు నూతనంగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తమకు ఏమాత్రం తెలియకుండా చేశారని దంగేరు ఎంపీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన సభ్యులు తమకు జరిగిన అనుభవాలను సభలో మొరపెట్టుకున్నారు. ఇదేవిధంగా గ్రామంలో జగనన్న కాలనీలో రహదారులు నిర్మించకపోవడంతో పడుతున్న ఇబ్బందులు వివరించారు. సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ, జడ్పీటీసీ ఓలిశెట్టి శ్రీవరలక్ష్మి మాట్లాడుతూ జగనన్న కాలనీ రోడ్లు గురించి గతంలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, తక్షణమే పరిష్కరించాలని కోరారు. జలజీవన్ మిషన్‌లో యర్రపోతవరంలో చేసిన పనులు సగం చేశారని సర్పంచ్ పిల్లి రాంబాబు ఫిర్యాదు చేశారు. సుందరపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌వోప్లాంటును ఏర్పాటు చేయాలని జనసేన ఎంపీటీసీ తాడాల జానకిరామ్ కోరారు. భట్లపాలిక పరిధిలోని ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని బాగు చేయించాలని సర్పంచ్, ఎంపీటీసీలు కోరారు.

స్త్రీనిధిలో అక్రమాలపై విచారణ చేయండి: ఎంపీ బోస్

స్త్రీనిధిలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని సమాచారం ఉంది. ప్రతీ గ్రామంలో స్త్రీనిధి దుర్వినియోగమైంది. దీనిపై సమగ్రంగా విచారణ చేయాలని ఎంపీ బోస్ ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌ను ఆదేశించారు. అధికారులు గ్రామాల్లో ఏప్రభుత్వ కార్యక్రమం నిర్వహించినా స్థానికసర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలని, మండల స్థాయిలో ఎంపీపీ, జడ్పీటీసీలను భాగస్వాములు చేసి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీలు నీతిపూడి మధుబాల, దూడల నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ పందు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, తహసీల్దార్ టి.వైద్యనాథ్‌శర్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుడు 'అంబటి' మృతి

ఉప్పలగుప్తం, జనవరి 29: గొల్లవిల్లికి చెందిన విశ్రాంత ఆంగ్లోపన్యాసకుడు అంబటి సత్యనారాయణరావు ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సంతాపసూచకంగా భట్లుపాలెం ఏవీఎస్ఎన్ జూనియర్, ఒకేషనల్ కళాశాలలకు సెలవు ప్రకటించారు. అంబటి మృతికి ఏవీఎస్ఎన్, సీఎస్ఎం, ఎంఎస్ఎస్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అడపా గోపి, కె.బాలాజీ, మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ, కవి నల్లా నరసింహమూర్తి సంతాపం తెలిపారు.

జన సేవకుడు చేయూత

పి.గన్నవరం, జనవరి 29: ఉడిమూడికి చెందిన జనసేవకుడు గిడ్డి సత్య నారాయణ సోమవారం పి.గన్నవరం, అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి మండలాలకు చెందిన వికలాంగులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతోన్న 25మందికి రూ.4లక్షలు అందించారు. జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, జాలెం శ్రీనివాసరాజా, దొమ్మేటి సాయి కృష్ణ, పోలిశెట్టి రాజేష్, అడబాల తాతకాపు పాల్గొన్నారు.

సీఐటీయూ సహకారం ఉంటుంది

కాట్రేనికోన, జనవరి 29: సూర్య పెయింటింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ కార్యవర్గ సమావేశం కాట్రేనికోన హైస్కూల్ వద్ద జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్‌కు అన్నివిధాలా సహకరించేందుకు సీఐటీయూ నాయకులు అంగీకరించారు. సంఘ అధ్యక్షునిగా రేవు వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా జగడం చినబాబు, బొంతు రాంబాబు, ఆర్.రమణ, ప్రధానకార్యదర్శిగా సంగాని వంశీ, కోశాధికారిగా వజ్రపు రమేష్, గౌరవాధ్యక్షునిగా వరసాల చిన్నారావు, 5సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీ యూ అధ్యక్షుడు విప్పర్తి మోహనరావుపాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు తగ్గించి ఒత్తిడిపెంచిన ప్రభుత్వం

అల్లవరం, జనవరి 29: రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.117 ద్వారా పాఠశాలలను విలీనం చేసి ఉపాధ్యాయ పోస్టులు తగ్గించి యాప్‌లతో ఒత్తిడి పెంచిందని ఎస్టీయూ రాష్ట్రఅధ్యక్షుడు ఎల్.సాయిప్రసాద్‌ఆరోపించారు. ఎస్టీయూ జిల్లా సమావేశం జిల్లా శాఖ అధ్యక్షుడు నేరేడుమల్లి సత్యనారాయణ అధ్యక్షతన అల్లవరంలోని సత్యకస్తూరి కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తిలో కొత్త పోస్టులు మంజూరు చేయాలని, డీఎస్సీ వెంటనే ప్రకటించాలన్నారు. పీఆర్సీ ప్రకటించి 12 నెలలైనా నేటికీ ఐఆర్ ప్రకటించలేదన్నారు. జీపీఎస్ రద్దు చేసి వెంటనే ఓపీఎస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ప్రధాన కార్యదర్శి వి.సత్యనారాయణ, సుదర్శన చక్రవర్తి, రాష్ట్ర నాయకులు పోసుంశెట్టి దొరబాబు, నల్లిప్రసాద్, ఉమాపతి శాస్త్రి, నాగిరెడ్డి శివప్రసాద్, మోరి విజయకుమారి, ఎస్ఎస్ పల్లంరాజు, వైవీ నాగభూషణం, బోనం గంగాధర్, రత్నకుమారి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

రాయవరం, జనవరి 29: మద్యం విక్రయిస్తున్న ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జి.నరేష్ సోమవారం తెలిపారు. ఈనెల27న మాచవరంలో కొండపు చిన్నఅబ్బాయిని అరెస్టుచేసి 22లీటర్ల సారా, రూ.2వేలు, 28న పసలపూడికి చెందిన మహిళను అరెస్టుచేసి 8మద్యం బాటిళ్లు, 29న మాచవరానికి చెందిన మహిళను అరెస్టుచేసి 14బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం, జనవరి 29: రామచంద్రపురం, ఓదూరు, చెల్లూరు ఫీడర్లలో లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ వై.విజయానంద్ తెలిపారు. రామచంద్రపురంలో బ్రాడీపేట, స్టేట్‌బ్యాంక్‌వీధి, రామకృష్ణసెంటర్, మార్కెట్ సెంటర్, మాతంగిహోటల్, రత్నంపేట, ముచ్చుమిల్లి రోడ్, అఫీషియల్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు, కమ్మవారి సావరం, వీఎస్ఎం కాలేజీ, పసలపూడి చైతన్య రైస్‌మిల్లు, ఆర్డీవో ఆఫీస్, అరికరేవులరైస్‌మిల్లు, చేపల చెరువులు, నరసాపురపుపేట, ఓదూరుప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

మండపేట, జనవరి 29: ప్రపంచ చక్కెర వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని గతేడాది నవంబరు 14న నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో మండపేట శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు 12మంది విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. మండపేటకు చెందిన ప్రముఖ డాక్టర్ బిక్కిన తాతాబ్బాయి వారికి జ్ఞాపికలు అందజేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: 105
వెంకటరమణ	: డెవిల్
శ్రీలలిత	: కెప్టెన్ మిల్లర్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

జనసేన నాయకులను కలుస్తున్న దేవ వరప్రసాద్

మలికిపురం, జనవరి 29: రాజోలు అసెంబ్లీ స్థానానికి జనసేన పార్టీ పోటీలో ఉంటుందని పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించిన సంగతి విదితమే. దీంతో విశ్రాంత సివిల్ సప్లయిస్ కమిషనర్ దేవవరప్రసాద్ రాజోలు నియోజకవర్గంలోని జనసేన నాయకులను కలుస్తున్నారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేయడంతో పాటు పంచాయతీరాజ్, సివిల్ సప్లయి కమిషనర్‌గా పనిచేశారు. జనసేనలో చేరడంతో పాటు రాష్ట్ర నాయకత్వంలో క్రియాశీలకంగామారి పవన్‌కల్యాణ్‌కు సన్నిహితంగా ఉంటున్నారు.

సూర్యప్రకాష్‌ను కలిసిన క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు

రామచంద్రపురం, జనవరి 29: వైసీపీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్‌ను సోమవారం జిల్లా క్రిస్టియన్, మైనార్టీ సెల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. క్రిస్టియన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.బాబూరావు, ఉపాధ్యక్షుడు ఫిలిప్ రాజు, కె.సూర్యప్రకాష్, వై.శామ్యూల్, మాషీలామనీలు సూర్యప్రకాష్‌ను కలిసి అభినందించారు.

ఏపీసీగా మధుసూదనరావు



ముమ్మిడివరం, జనవరి 29: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఎ.మధుసూదనరావు నియమితులయ్యారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న మధుసూదనరావును ఏపీసీగా నియమిస్తూ రాష్ట్ర సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు విడదల చేశారు. ఈమేరకు మధుసూదనరావు సోమవారం ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి ఏపీసీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయి ఏపీసీని నియమించడంతో సమగ్ర శిక్షా పరిధిలో జరిగే పథకాలు, కార్యక్రమాలు అమలులో వేగవంతమయ్యే అవకాశం ఉంది.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, జనవరి 29: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి శ్రీవేంకటేశ్వర వాసవి సత్య అన్నదాన ట్రస్టు తరఫున శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం రూ.50వేలు విరాళం సమర్పించారు. సోమవారం వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,75,801 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజుతెలిపారు.

ముగ్గురికి గాయాలు

కాట్రేనికోన, జనవరి 29: కాట్రేనికోన సుబ్బారాయుడు గుడిసమీపంలో సోమవారం పిచ్చికుక్క కాటుకు ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో వ్యాక్సిన్ లేకపోవడంతో బాధితులను అమలాపురం తరలించారు.

అట్రాసిటీ కేసుల కోసం ప్రత్యేక కోర్టు

పి.గన్నవరం, జనవరి 29: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐడీ సీఐలు ఇళ్ల గోపాలకృష్ణ, వి.శ్రీనివాసరావు సూచించారు. నరేంద్రపురంలో హైస్కూల్లో సర్పంచ్ బీర వెంకమాంబ అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీఎస్టీ అట్రాసిటి చట్టం అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎస్సీఎస్టీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఉన్నాయన్నారు. పలుఅంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సీఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ హరికోటి శాస్త్రి, సీఐడీ ఎస్ఐ కె.శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మీప్రసాద్, ఎంపీటీసీ నేలపూడి దామోదరం,పిల్లి శ్రీనివాసరావు, కొంబత్తుల ఏసుబాబు, కటికదల శ్రీనివాసరావు, తరపట్ల ప్రసాద్, కేదాశి చిన్నా, జల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఆసరా' చెక్కుల పంపిణీ

ఆత్రేయపురం, జనవరి 29: ఆత్రేయపురం, పేరవరంల్లో సోమవారం జరిగిన నాల్గవ విడత ఆసరా సభలకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్వాక్రా మహిళలకు లక్కీ డిప్ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఆత్రేయపురంలో రూ.1.18కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోణం సాయిబాబా, ఏఎంసీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు, అప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ కప్పల శ్రీధర్, వైసీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్‌లు రాయి వెంకటేశ్వరరావు, కొరుప్రోలు వెంకటేశ్వరరావు, కొల్లి శ్యామ్‌సన్, సర్పంచ్ పాలా నాగేశ్వరరావు, ఎంపీడీవో నాతి బుజ్జి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ పునఃనిర్మాణానికి రూ.5లక్షలు విరాళం



పి.గన్నవరం, జనవరి 29: ముంగండ గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ పునఃనిర్మాణానికి పోతవరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మెట్రోకెమ్ ఏపీఐ ప్రైవేటు లిమిటెడ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) దంపతులు రూ.5,01,116 విరాళాన్ని ప్రకటించారు. ఈమొత్తాన్ని కమిటీ సభ్యులకు హైదరాబాదులో అందించారు. అంబటి కోటేశ్వరరావు, నందెపు తాత, బొడ్డు వెంకటసురేష్, పెచ్చెట్టి వెర్రియ్య, సరెళ్ల అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

మామిడికుదురు, జనవరి 29: మధ్యాహ్న భోజనం చేయలేదని ఏడో తరగతి విద్యార్థి గుడిమెళ్లలంక నిఖిల్‌ను కొట్టిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలంటూ పాశర్లపూడిలంక వాసులు స్కూలు వద్ద సోమవారం ధర్నా చేశారు. తన కుమారుడు నిఖిల్ భోజనం చేయకుండా ఇంటికి వస్తుంటే హెచ్‌ఎం నిట్టల వీఎస్ఎస్ దుర్గాప్రసాద్ జుట్టు పట్టుకుని కొట్టాడని విద్యార్థి తండ్రి గుడిమెళ్లంక కాశీ ఆరోపించాడు. మొదటి నుంచి హెచ్‌ఎం ప్రవర్తన సరిగా లేదని ఆరోపించారు. హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. డీఈవో కమలకుమారి అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నామన్నారు. ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, కోలా సత్తిబాబు, విప్పర్తి సత్యంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయి

మామిడికుదురు, జనవరి 29: అప్పనపల్లి ఉచ్చులవారిపేటకు వెళ్లే దారిలో పాటురేవుపై నిర్మించిన వంతెనతో లంక గ్రామాల ప్రజల కష్టాలు గట్టెక్కుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. పాటురేవు పాయపై రూ.50లక్షలతో నిర్మించిన వంతెనను, రూ.5.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. పలువురి సహకారంతోనే వీటిని నిర్మించామని, ఈసందర్భంగా వారిని వారు అభినందించారు. లంక గ్రామాల ప్రజల కష్టాలు తీర్చిన కలెక్టర్, ప్రజాప్రతినిధులను స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కె.వనజాకుమారి, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీలు నెల్లి దుర్గాప్రసాద్, బొంతు నీలిమ, సొసైటీ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, యూవీవీ సత్యనారాయణ, గెద్దం కృష్ణమూర్తి, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భారత్‌పర్వ్‌లో పుదుచ్చేరి పర్యాటక శాఖ

యానాం, జనవరి 29: కేంద్రం ఈనెల26నుంచి నిర్వహిస్తున్న పరాక్రమ దివస్‌ను పురస్కరించుకుని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద భారత్ పర్వ పేరిట వివిధ రాష్ట్రాల సంప్రదాయ ఆహార పదార్థాలు, హస్తకళా ఉత్పత్తులు, పర్యాటక ప్రాంతాలు శిబిరాలతో తొమ్మిదిరోజులు ఉత్సవాలు నిర్వహిస్తోంది. పుదుచ్చేరి పర్యాటకశాఖ తరుపున ఫుడ్‌స్టాల్‌ను ఏర్పాటుకు ఈఏ డాది అవకాశం లభించింది. యానాం సీగల్స్ మేనేజర్ మురళీధరన్ ఆధ్వర్యంలో ప్రధానచెఫ్ బి.శ్రీనివాస్, కె.మల్లికార్జునరావు, ఎం.నీలాద్రీ, డి.వెంకట్రావు(చిన్నా) సందర్శకులకు వివిధ రకాల వంటలను తయారుచేసి రుచి చూపిస్తున్నారు. పుదుచ్చేరి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరుపున యానాం, పుదుచ్చేరి నుంచి 27మంది పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రావటం ఖాయం

మండపేట, జనవరి 29: ప్రజా వ్యతిరేక పాలనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఏడిదలో ఐదో రోజు సోమవారం జరిగిన బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక టీడీపీ, జనసేన నేతలతో కలిసి గ్రామంలో పర్యటించారు. రాష్ట్రాన్ని అన్నివిధాలుగా దివాళా తీయించిన జగన్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయన్నారు. త్వరలోనే వైసీపీ విముక్త రాష్ట్రం కానుందని ఆయన అన్నారు. ప్రజల సమస్యలను వేగుళ్ల అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

ప్రిన్స్ మహేష్‌బాబు ఫ్యాన్స్ సంబరాలు

మండపేట, జనవరి 29: ప్రిన్స్ మహేష్‌బాబు చిత్రపరిశ్రమకు వచ్చి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు మండపేటలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఫ్యాన్స్ అధ్యక్షుడు మెండు సత్తిబాబు సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో గుంటూరు కారం చిత్రపంపిణీదారుడు పడాల దుర్గారెడ్డి హాజరయ్యారు. కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల రాంబాబు, మెండు రవిచంద్ర, పోలోబోతు గణేష్, అరుణ్, బాబ్జి, దుగ్గిరాల గణేష్, అభిమానులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌ల నిరసన దీక్షకు తరలిరావాలి

అంబాజీపేట, జనవరి 29: సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారించాలంటూ ఈనెల30న అమలాపురం గడియార స్తంభం వద్ద చేపట్టే ఒక రోజు నిరసన దీక్షకు జిల్లాలోని సర్పంచ్‌లందరూ హాజరుకావాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వైసీపీ ప్రభుత్వం కాజేయడం, సర్పంచ్‌ల 16 డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరుతూ దీక్ష చేస్తున్నట్టు చెప్పారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ద్వారపూడిలో ఆపాలి

మండపేట, జనవరి 29: ద్వారపూడిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని కోరూతూ అమలాపురంలో వచ్చిన కేంద్ర మంత్రి నారాయణస్వామిని సోమవారం స్థానిక బీజేపీ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ వివరించారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు

రామారావుకు సన్మానం

ఆలమూరు, జనవరి 29: ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 27ఏళ్లుఅధ్యాపకునిగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన కోటిపల్లి వెంకటరామారావును సోమవారం విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. జూనియర్, డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

కులగణన సర్వేలో 'అల్లవరం' తృతీయం

అల్లవరం, జనవరి 29: కులగణన సర్వేలో అల్లవరం మండలం రాష్ట్ర స్థాయిలో తృతీయ, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. జిల్లా ప్రణాళిక గణాంకాధికారి ఐవీ సుధాకరరావు, ఆర్డీవో కార్యాలయ ఉప గణాంకాధికారి ఎ.ప్రభుదాస్, ఎంపీడీవో కృష్ణమోహన్ అల్లవరంలో సర్వే విధానాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 96 శాతం సర్వే పూర్తిచేసి మండలాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఎంపీడీవో కృష్ణమోహన్‌ను జిల్లా అధికారులు అభినందించారు.